ప్రజాశక్తి
ఆదివారం 6 ఆగస్టు 2023



మూగజీవాల మృత్యువాత



మృతి చెందిన ఆవు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల ఆవరణలో మేతమేస్తూ అకస్మాత్తుగా శనివారం ఆవులు, గొర్రెలు మృతి చెందాయి. మండల కేంద్రంలోని టిక్కిలి బెడ్డ వీధికి చెందిన గిరిజనులు స్థానిక ఏకలవ్య పాఠశాల ఆవరణలో శనివారం ఆవులను, గొర్రెలను మేతకు తీసుకెళ్లారు. అయితే మూగజీవలు మేత మేస్తూ అకస్మాత్తుగా ఒకొక్కటి కిందికి పడి, రెండు ఆవులు, ఐదు గొర్రెలు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు, వ్యవసాయానికి ఉపయోగించే మూగజీవాలు హఠాన్మరణంతో తాము ఇబ్బందులు పడుతున్నామని గిరిజనం ఆవేదన చెందుతున్నారు.

9న మహాధర్నాను జయప్రదం చేయండి

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి కోటేశ్వరరావు



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో 'మోడీని గద్దె దించుదాం దేశాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో ఈనెల 9న జిల్లా కేంద్రాల్లో మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి కోటేశ్వరరావు తెలిపారు. శనివారం అరకువేలిలో సిఐటియు జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆధ్వర్యాన క్విట్ ఇండియా స్ఫూర్తితో 9న మహాధర్నాకు పిలుపునిచ్చామన్నారు.

బిజెపి అధికారం చేపట్టినప్పటికీ నుండి కార్మికుల కోరికలు నెరవేర్చలేదన్నారు.కనీస వేతనం రూ.26 వేలు అమలు కావడం లేదని పిఎఫ్,ఈఎస్ఐ చెల్లింపు, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత వంటి చర్యలు చేపట్టలేదన్నారు. ప్రయివేటీకరణ ద్వారా ప్రభుత్వ రంగాన్ని సర్వనాశనం చేయాలని మోడీ ప్రభుత్వం చూస్తోందని,కార్పొరేట్లకు దేశ సంపదను కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఎ.మోడీ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల పిలుపుమేరకు 9న జరిగే మహాధర్నాను కార్మిక వర్గం విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులు సన్నీ బాబు,ఎస్పి పోతురాజు, జన్ని బంధు, భగత్ రాం, సత్యనారాయణ, మొస్య, అంగన్వాడి, ఆశ, మధ్యాహ్న భోజనం,టూరిజం, ఆర్డబ్ల్యుఎస్, జిసిసి, వర్కర్స్, హాస్టల్ వర్కర్స్, ఐకెపి, విఒఎలు, ముఠాకార్మికులు, 108,104 సిబ్బంది, బిల్డింగ్ వర్కర్స్, విఆర్ఎ, ఐటిడిఎ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నేడు గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి పాడేరు: ఎపి గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం విశాఖపట్నం ఉమ్మడి జిల్లా శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం పాడేరు జిల్లా కేంద్రంలోని తలారిసింగి అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఈ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు పలాసి కష్ణారావు శనివారం విలేకరులకు తెలిపారు. ఈ ఎన్నికలకు సంబంధించి అన్ని జోన్లను కలిపి ఓటింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఏజెన్సీ 11 మండలాల్లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ, జిపిఎస్ పాఠశాలల్లో పనిచేస్తున్న అన్ని కేడర్ల ఉపాధ్యాయులు సుమారు 1200 మంది ఈ ఓటింగ్‌లో పాల్గొంటారని చెప్పారు. ప్యానల్ పద్ధతిలో ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నామన్నారు. ప్యానల్ ఏ నుంచి అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల అభ్యర్థులుగా కోడ. చిట్టిబాబు, కూడా రాంబాబు, ప్యానెల్ బి నుంచి అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల అభ్యర్థులుగా కంబిడి నీలకంఠం మాసాడ శోభన్‌బాబు పోటీలో నిలిచారని, ఈ రెండు ప్యానల్స్ మధ్య ఓటింగ్ జరుగుతుందని తెలిపారు. ఈ ఎన్నికల అధికారులుగా జీవివి ప్రసాద్, ముఖి శేషాద్రి, ఎం అప్పారావు ఎస్ సన్యాసిరావు, ఎం బాలరాజు వ్యవహరిస్తారని తెలిపారు.. అలాగే ప్రధానోపాధ్యాయ సంఘం అధ్యక్షులు ఎస్ పూర్ణచంద్రరావు, గౌరవ అధ్యక్షులు ఆర్ జాన్, మహిళా కార్యదర్శి ఎం గంగాభవాని ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరిస్తారన్నారు. ఓటింగ్ లో పాల్గొనే ఉపాధ్యాయ ఓటర్లందరూ తమ గుర్తింపు కార్డు తీసుకొని పోలింగ్ హాజరు కావాలని సూచించారు.

తల్లి పాలే బిడ్డకు శ్రేష్టం : ఎమ్మెల్యే



తల్లి పాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి -పాడేరు: తల్లి పాలే బిడ్డకు శ్రేష్టమని, పుట్టిన ఆరునెలల వరకు బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సూచించారు. శనివారం పాడేరు ఐటిడిఎ సమావేశ మందిరంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొని, తల్లిపాలు ప్రాముఖ్యతను వివరించారు. బిడ్డకు తల్లి పాలను తప్పనిసరిగా అందించాలని, అందుకు అవసరమైన పౌష్టికాహారాన్ని తల్లులు తీసుకోవాలన్నారు. ప్రభుత్వపరంగా గర్భిణులు, బాలింతలకు వైఎస్ఆర్ సంపూర్ణపోషణ ద్వారా. ప్రభుత్వమే పౌష్టికాహారాన్ని ఉచితంగా అందిస్తుందన్నారు. అంగన్వాడీ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకూ ప్రతి ఒక్కరూ తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొనాలని అవగాహన కల్పించాలన్నారు. ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్ సూర్యలక్ష్మి మాట్లాడుతూ, తల్లిపాల శ్రేష్టతను వివరించారు. ప్రభుత్వమిచ్చిన పౌష్టికాహారాన్ని కుటుంబంలో ఇతరులకు పెట్టేయకుండా లబ్ధిదారులే తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చింతలవీధి ఎంపిటిసి గిడ్డి విజయకుమారి, మండల మహిళా అధ్యక్షులు కిల్లో ఊర్వశిరాణి, సిడిపిఒలు, అంగన్వాడీ సూపర్వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని ఉపాధ్యాయుల ధర్నా



ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -హుకుంపేట: బదిలీలు, ప్రమోషన్లు పొందుతున్న ఉపాధ్యాయులు, ఎంఇఒ-2లకు జీతాలు చెల్లించాలని ఎపిటిఎఫ్ నేతలు మత్స్యరాజు, ప్రభాకరరావు, చిన్నారావు డిమాండ్ చేశారు. శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి, తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల బదిలీలు, ప్రమోషన్లు పొంది 55 మంది ఉపాధ్యాయులకు జీతాలు అందలేదని, సాంకేతిక కారణాలతో వారి జీతాలు చెల్లింపు జాప్యం చేయడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బకాయి పడ్డ జీతాలు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో హుకుంపేట మండల ఎపిటిఎఫ్ నేతలు దొర, సత్యారావు కన్నరావు, తౌడంనాయుడు, సుభద్ర పాల్గొన్నారు.

16 వేల ఎకరాల్లో కాఫీ ప్లాంటేషన్

సాగు విస్తరణకు వార్షిక ప్రణాళిక సిద్ధం చేసిన ఐటిడిఎ

8న 2.20 కోట్ల కాఫీ మొక్కల పంపిణీ, నాటేందుకు శ్రీకారం



పంపిణీకి కాఫీ మొక్కలను సిద్ధం చేస్తున్న ఐటిడిఎ అధికారులు

ప్రజాశక్తి -పాడేరు:. పాడేరు ఏజెన్సీలో ఈ ఏడాది కొత్తగా 16 వేల ఎకరాల్లో కాఫీ ప్లాంటేషన్ చేపట్టేందుకు ఐటిడిఎ వార్షికప్రణాళిక సిద్ధం చేసింది. ఏజెన్సీ వ్యాప్తంగా ఇప్పటికే సుమారు రెండు లక్షల ఎకరాల్లో కాఫీ తోటలు విస్తరించి ఉన్నాయి. ఐటిడిఎ తోడ్పాటుతో కాఫీ సాగు చేస్తున్న గిరిజన రైతులకు కోట్ల ఆదాయంతోపాటు అంతర్జాతీయంగా ఎన్నో పురస్కారాలతో కీర్తిప్రతిష్టలు తెచ్చిపెడుతోంది. ఇంతటి విశిష్టత కలిగిన కాఫీ సాగులో ఐటిడిఎ కీలక పాత్ర పోషిస్తూ,ప్రతిఏటా సాగువిస్తీర్ణం పెంచుతూ పోతోంది. ఈ ఏడాది పాడేరు ఏజెన్సీలోని 11 మండలాల్లో 2.20 కోట్ల కాఫీ మొక్కలను ఈ నెల 8న పంపిణీకి శ్రీకారం చుట్టడం ద్వారా ఈ బృహత్తర కార్యక్రమాన్ని ఐటిడిఎ చేపడుతోంది.

మండలాల వారీగా కాఫీ మొక్కల పంపిణీ.

కాఫీ సాగు విస్తరణలో భాగంగా ఏజెన్సీలో మండలాల వారీగా ఏయే గ్రామాల్లో ఎంతమంది రైతులు, ఎన్ని ఎకరాల్లో కాఫీ సాగు లక్ష్యంగా పెట్టకున్నారో అధికారులు వెల్లడించారు. అనంతగిరి, అరకువ్యాలీ, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు ముంచంగిపుట్టు మండలాల్లో వెయ్యి ఎకరాలు చొప్పున, జికె.వీధి, జి.మాడుగుల మండలాల్లో రెండు వేల ఎకరాలు చొప్పున, కొయ్యూరు, పాడేరు మండలాల్లో 1500 ఎకరాలు చొప్పున, చింతపల్లి మండలంలో మాత్రం మూడు వేల ఎకరాల్లో కొత్తగా కాఫీ తోటలసాగుకు సన్నద్ధం చేస్తున్నారు. అనంతగిరిలో మండలంలో 115 గ్రామాల్లో 812 మంది రైతులు, అరకు వ్యాలీలో 134 గ్రామాలు, 982 మంది రైతులు, డుంబ్రిగుడలో 153 గ్రామాలు 982 మంది రైతులు, హుకుంపేటలో152 గ్రామాలు వెయ్యి మంది రైతులు, పెదబయలులో 137. గ్రామాలు 1089 మంది రైతులు, ముంచంగిపుట్టులో 150 గ్రామాలు 1167 మంది రైతులు, పాడేరులో 119 గ్రామాలు 1410 మంది రైతులు, జి. మాడుగులలో 155 గ్రామాలు 1888 మంది రైతులు చింతపల్లిలో 162 గ్రామాలు 2844 మంది రైతులు, జికె. వీధిలో 129 గ్రామాలు 1491 మంది రైతులు, కొయ్యూరు మండలంలో 29 గ్రామాలు 840 మంది రైతులు కాఫీ తోటలు సాగుకు సిద్ధం చేస్తున్నారు. దీంతోపాటు 12,999 ఎకరాల పాత కాఫీ తోటల పునరుద్ధరణ, మరో 15 వేల ఎకరాల్లో గ్యాప్ పిల్లింగ్‌కు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. జి.మాడుగుల, జికె.వీధి మండలాల్లో చెరో రూ.3.85కోట్లు చొప్పున మొత్తంగా రూ.7.70కోట్లతో రెండు ఎకో కాఫీ పల్పింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు. కాఫీ రైతులకు మంచి గిట్టుబాటు ధర కల్పనకు నిరంతరం ఐటిడిఎ కృషి చేస్తోంది.

ఆదివాసీల హక్కులపై రాజయ్య రాజీ లేని పోరాటం

వర్ధంతి సభలో ఆదివాసీ గిరిజన సంఘం నేతలు



రాజయ్యకు నివాళులర్పిస్తున్న ఆదివాసీ గిరిజన నేతలు

ప్రజాశక్తి- అరకులోయ: ఆదివాసీ గిరిజనుల హక్కులు, వారి సమస్యలపై మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య రాజీలేని పోరాటం చేశారనిఏపీ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ అన్నారు. శనివారంఅరకులోని ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో సున్నం రాజయ్య మూడవ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం మండల కార్యదర్శి పాంగి రామన్న అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బాలదేవ్ మాట్లాడుతూ, ఆదివాసి ఉద్యమకారుడు, మార్గదర్శకుడు, నిష్పక్షపాతి అయిన రాజయ్య లేని లోటు అటు కుటుంబానికే కాకుండా సంఘానికి, గిరిజనానికి తీర్చలేనిదన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన రాజయ్య తన జీవితాన్ని ఆదివాసీలకు అంకితం చేశారని, ఆదివాసీ హక్కులు, 1/70చట్టం పరిరక్షణకు గిరిజన సలహామండలి కోసం చట్టసభల్లో పోరాడారన్నారు

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి, ఆదివాసీ హక్కుల కోసం అసెంబ్లీలో కోయభాషలో ప్రసంగించి ఆదివాసీల గొప్పతనాన్ని చాటారన్నారు. ఆదివాసులపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు దాడి చేస్తున్న ప్రస్తుత తరుణంలో అటవీ సవరణ చట్టం రద్దు, బోయ/వాల్మీకులకు ఎస్‌టి జాబితాలో చేర్చే తీర్మానం రద్దు, జిఒ 3చట్టబద్ధత, పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి రాజయ్య స్ఫూర్తితో పోరాడి సాధించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న, నానిబాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌పి. పోతురాజు, జిల్లా కార్యదర్శి కె.మోసియా, కార్మిక సంఘం నాయకులు రాజు, రాంబాబు, కొండలరావు, దాసమ్మ, మంజుల, కళావతి పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

రాష్ట్ర మాజీ హోం శాఖ మంత్రి చినరాజప్ప



చింతూరులోని ముంపు ప్రాంతంలో పర్యటిస్తున్న చినరాజప్ప, టిడిపి నాయకులు

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు, కూనవరం, విఆర్ పురం, ఎటపాక మండలాల్లోని వరద బాధితులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని రాష్ట్ర మాజీ హోంశాఖ మంత్రి, పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప డిమాండ్ చేశారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం చింతూరు శబరి ఒడ్డు సంతపాకలోని వరద బాధితులను నేరుగా కలుసుకొని వారి బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పోలవరం బ్యాక్ వాటర్‌తో తమ ప్రాంతంలోని ఇల్లు పొలాలు పూర్తిగా ముంపునకు గురవుతున్నాయని, ఈ బాధలు ప్రతి ఏటా పడలేకపోతున్నామని తెలిపారు. తమకు తక్షణమే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఇళ్లకు డబ్బులు ఇచ్చి మైదాన ప్రాంతాలకు తరలించి మాకు పక్కా ఇల్లు కట్టించాలని కోరారు. ఈ సందర్భంగా చినరాజప్ప మాట్లాడుతూ ప్రభుత్వం కొన్ని ప్రాంతాలకే వరద నష్టం కింద 2000 రూపాయలు, నిత్యావసర సరుకులు ఇచ్చి కొన్ని ప్రాంతాలకు విడిచిపెట్టడం సబబు కాదన్నారు. ముంపుకు గురైన అన్ని గ్రామాలను గుర్తించి వారికి కూడా ప్రభుత్వం నిత్యవసర సరుకులు నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పునరావస కేంద్రాలలో ప్రజలకు సరైన భోజన వసతి కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు, ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ, మాజీ శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వంతల రాజేశ్వరి, సీతంశెట్టి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు ఎర్ర వేణుగోపాల్ రాయుడు, బాబు రమేష్, ఇళ్ళ చిన్నారెడ్డి, ఓబిల్లనేని రామారావు చౌదరి, మల్లెలి వెంకటేశ్వరావు, ఎండి జహంగీర్, మోతుగూడెం ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, ముత్యాల శ్రీరామ్, సాల్మన్ రాజ్, మంగవేణి, రియాజ్, శీలం తమ్మయ్య, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు

డిపిఒ కొండలరావు



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న డిపిఒ కొండలరావు తదితరులు

ప్రజాశక్తి- చింతూరు

చింతూరు డివిజన్ పరిధి నాలుగు మండలాల్లోని వరద ముంపు గ్రామాలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించినట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు పేర్కొన్నారు. శనివారం పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వరద ముంపు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలకు సుమారు 250 మంది పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మలేరియా, డెంగీ వ్యాధులు రాకుండా దోమల నివారణకు సంబంధించిన పొగ స్ప్రే చేశామని, ప్రతి గ్రామంలోని బ్లీచింగ్ చల్లించామని తెలిపారు. డ్రైనేజీలు మట్టితో పూడిపోయిందని, ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోయిందని, వాటిని కూడా తొలగించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి జియన్‌యల్‌వి రాఘవన్, ఇఒపిఆర్‌డి, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'వర్క్ టు రూల్'

ప్రజాశక్తి -సీలేరు

విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లు ఏపీ జెన్కో యాజమాన్యం నేటికీ నెరవేర్చకపోవడంతో వర్క్ టు రూల్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని స్థానిక ఏపీ జెన్కో జేఏసీ నాయకులు వై.సత్తిబాబు వెల్లడించారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ జెన్కో యాజమాన్యం విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చడంలో మొండివైఖరి అవలంభిస్తుందని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు వర్క్ టు రూల్‌లో భాగంగా ప్రతిరోజు ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎటువంటి సమస్యలు ఉత్పన్నమైన తమ కార్మికులు విధులకు హాజరు కారని స్పష్టం చేశారు. మరసటి రోజు విధులకు హాజరై సమస్యల పరిష్కరిస్తామని, ఈ విషయాన్ని ప్రజలు వినియోగదారులు గుర్తించి సహకరించాలని కోరారు. 2022 పిఆర్సి అమలు, ఈపీఎఫ్‌ను జిపిఎఫ్‌గా మార్చడం, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయడం, సమాన పనికి సమాన వేతనం కల్పించడం, రావలసిన మూడు డిఏలు మంజూరు చేయడం వంటివి ప్రధాన డిమాండ్లను యాజమాన్యం తక్షణమే నెరవేర్చాలని కోరారు. లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



ఢిల్లీ బయలుదేరే కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న మేకల నాగేశ్వరరావు

ఢిల్లీ ధర్నాకు నిర్వాసితుల పయనం

ప్రజాశక్తి-కూనవరం

పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 7న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన జరుగు ధర్నాకు మండలం నుండి బాధిత నిర్వాసితులు, సిపిఎం కార్యకర్తలు శనివారం బయలుదేరారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక మార్తా శ్రీరామ్మూర్తి భవనం వద్ద సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ వరదల వల్ల ముంపు మండలాలు ఏటా తడిసి ముద్దాయితున్నాయని, ప్రభుత్వాలకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నిర్వాసితుల గోడు పట్టడం లేదన్నారు. అందుకే ఢిల్లీలోనే ఈ సమస్యపై పోరాటానికి సీపీఎం సిద్ధమైందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురవుతున్న ఇళ్లకు, కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ భూములకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పునరావాస కాలనీలకు వెళ్లే సమయానికి 18 ఏళ్ల నిండే యువతీ యువకులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, పునరావాస కాలనీల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా గతేడాది జులైలో వచ్చిన వరదలకు మునిగిన అన్ని గ్రామాల ప్రజలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమం వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, నిర్వాసితులు పాల్గొన్నారు.

చింతూరు : ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగే ధర్నాకు చింతూరు మండలం నుండి సిపిఎం బృందం శనివారం విశాఖ చేరుకొని అక్కడి నుండి రైలులో ఢిల్లీ బయలుదేరింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోలవరం వరద బాధితుల సమస్యలు హస్తినాపూర్‌లో వినిపించేలా ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాంటూరు లెక్కలతో నిర్వాసితులను అయోమయంలో పడవేసి పునరావాసం మాటే మరిచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ఒకరిపై ఒకరు వంతులు వేస్తూ పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. కాపర్ డ్యాం బ్యాక్ వాటర్ ప్రభావంతో కొద్దిపాటి వర్షాలకే గిరిజన గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయన్నారు. ఉన్న ఊరు పుట్టిన గడ్డ, పొలాలు, వ్యాపారాలు వంటివి పోలవరం ప్రాజెక్టు కోసం త్యాగం చేస్తున్న ప్రజలకు ప్రభుత్వం మొండి చేయి చూపటం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన సిపిఎం నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, పల్లపు వెంకట్, కారం సుబ్బారావు, నగేష్ తదితరులున్నారు.

వరద నష్టపరిహారం ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు ఎస్‌టి కాలనీ, బిసి కాలనీ, నిమ్మలగూడెం గ్రామాల ప్రజలకు వరద నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతూ ఆయా గ్రామస్తులు శనివారం తహశీల్దారు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కలెక్టర్, రెవిన్యూ అధికారులు, అధికార పార్టీ నాయకులు కలిసి కుట్రపూరితంగా తమ మూడు గ్రామాలకు అన్యాయం చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి బిజెపి నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సొడే కృష్ణమూర్తి, పాయం వెంకయ్య, డివిఎస్ఎన్ రమణ రెడ్డి, సత్యపాటి రమణ, రామయ్య, అలీ, కరీం పాల్గొన్నారు.



బియ్యం పంపిణీ చేస్తున్న సర్పంచ్ సరోజినీ, ఎంపిటిసి విజయలక్ష్మి

వరద బాధితులకు బియ్యం పంపిణీ

ప్రజాశక్తి- విఆర్.పురం

మండలంలోని రేకపల్లి గ్రామపంచాయతీ పరిధి ఉమ్మడివరం గ్రామంలో వరద తక్షణం సహాయం కింద ఒక్కో కుటుంబానికి 25 కేజీల చొప్పున బియ్యాన్ని శనివారం రేకపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ చేతుల మీదుగా వరద బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదల వల్ల రహదారులు లేక చుట్టూ వరద చేరి చాలా ఇబ్బందులు పడ్డారని, అది దృష్టిలో ఉంచుకొని అధికారులతో మాట్లాడి ఈ గ్రామాలకు కూడా బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేసిందని, ఈ కాపర్ డ్యామ్ వల్ల బ్యాక్ వాటర్ రావడంతో 15 రోజులు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది రూ.2వేలు ఇచ్చి చేతులు దులుపుకున్న ప్రభుత్వం, ఈ సారైనా రూ.10వేలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. గృహాలు శుభ్రం చేసుకోవడానికి రూ.20వేలు నుండి రూ.30 వేలు అయిందని, తక్షణమే అవి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చిక్కల రామారావు, ప్రకాశరావు, కురసం నాగేశ్వరరావు, టిడిపి నాయకులు సవలం రాజు, సచివాలయం సిబ్బంది బుచ్చిరాజు సేల్సుమేన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-రంపచోడవరం

మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన రంపచోడవరం ఎపిటిడబ్ల్యుఆర్ బాలుర జూనియర్ కళాశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫస్ట్ క్లాస్ జుడిషియల్ మేజిస్ట్రేట్ బి.ప్రవీర్ బాలురకు వివిధ రకాల చట్టాలపైన అవగాహన కల్పించారు. ముఖ్యంగా యాంటీ ర్యాగింగ్ యాక్ట్, పోక్సో చట్టం, రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్, ఉచిత న్యాయ సహాయం, లోక్ అదాలత్, దిశ చట్టం, యన్.డి.పి.యస్ చట్టాల కోసం అవగాహన కల్పించారు. అనంతరం బాలుర వసతి గృహాని, విద్యార్థుల కంప్యూటర్ల ల్యాబ్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది సిహెచ్.సంతోష్ కుమార్, రంపచోడవరం యస్ఐ మోహన్ కుమార్, ప్రిన్సిపల్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న న్యాయమూర్తి, ఎస్ఐ తదితరులు


పోలీసుస్టేషన్‌లో అనుమతికి దరఖాస్తు చేసి వస్తున్న క్రిస్టియన్లు

మణిపూర్‌లో దాడులు అమానుషం
8న శాంతిర్యాలీ నిర్వహణకు అనుమతికి దరఖాస్తు

ప్రజాశక్తి -హుకుంపేట: మణిపూర్‌లో ఆదివాసీలు, క్రిస్టియన్లపై జరుగుతున్న హింస, అఘాయిత్యం దారుణమని హుకుంపేట పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె. జేమ్స్, వి.మోజెస్ అన్నారు. దీనికి నిరసనగా ఈనెల 8న మంగళవారం నిర్వహించే శాంతి ర్యాలీకి అనుమతి కోరుతు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు హుకుంపేట రాళ్లగెడ్డ నుండి కొంతిలి జంక్షన్ వరకు 500 మందితో శాంతి ర్యాలీ నిర్వహిస్తామన్నారు. క్రైస్తవ సంఘాలు, ఉద్యోగ, గిరిజన సంఘాలు, సిపిఎం, ప్రజా సంఘాలు మద్దతు ఇచ్చి ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హుకుంపేట పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కె.యోహాను, వైస్ ప్రెసిడెంట్ శంకరరావు పాల్గొన్నారు.


అధ్వాన రోడ్డును చూపిస్తున్న టిడిపి నేతలు

వైసిపి పాలనలో రోడ్ల అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: వైసిపి ప్రభుత్వ పాలనలో గిరిజనులకు ఎటువంటి అభివృద్ధి కానరాలేదని మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. శనివారం కురిడి పంచాయతీ నారింజవలస గ్రామాన్ని సందర్శించారు. గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నారింజవలస నుంచి జంగిడి వలస వరకు ఉన్న అసంపూర్తి రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించి, మండిపడ్డారు. టిడిపి ప్రభుత్వంలో నారింజవలస జంక్షన్ నుండి జంగిడివలస వరకు మట్టి రోడ్డు పని జరిగిందని, వైసిపి ప్రభుత్వ అధికారంలో వచ్చిన రోడ్డును నిర్లక్ష్యం చేశారన్నారు. రోడ్డు సౌకర్యం లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నా పట్టకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో అపాటి మండల అధ్యక్షుడు టి సుబ్బారావు, టిఎన్‌టియుసి అరకు పార్లమెంట్ కార్యదర్శి ఎం స్వామి పాల్గొన్నారు.

గీతం ఎన్ఎస్ఎస్ వన సంరక్షణ

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యాన జూ పరిసరాలలో వనసంరక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు మహ్మద్ కెమ్.చిష్టి, డాక్టర్ పి.రాజు, పి.అచ్యుతరావు, విద్యార్థి కో-ఆర్డినేటర్లు చరణ్, నితిన్, మిత్ర, చైతన్య ఆధ్వర్యాన వాలంటీర్లు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వన సంరక్షణ ప్రాధాన్యతను ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ వివరించారు. ప్రకృతి సమతుల్యతకు, కాలుష్య నివారణకు మొక్కల పెంపకం, అడవుల సంరక్షణ అవసరమని తెలిపారు. ప్లాంట్ ఎ హోప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన మేరీ మట్టి మేరీ దేశ్ నినాదంతో విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

మహిళలపై హింసకు ప్రభుత్వాలే కారణం


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐద్వా నేతలు (ఫైల్‌ఫోటో)

స్త్రీ రక్షణ చట్టాల అమలులో నిలువెత్తు నిర్లక్ష్యం
8న మహిళా పోరుయాత్ర బహిరంగసభ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: బిజెపి పాలనలో మహిళలకు భద్రత కరువై, హింస మరింత పెరిగిందని, రాష్ట్రంలోనూ ఇదే తరహాలో దాడులు జరుగుతున్నాయని మహిళలు విమర్శిస్తున్నారు. మహిళలపై హింస అరికట్టడం, మహిళా రక్షణ చట్టాలను పటిష్టంగా అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఐద్వా నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మహిళలకు రక్షణ కరువవుతోందని హింసను రెచ్చగొడుతున్న బిజెపిని బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని మండిపడుతున్నారు. మహిళలపై దాడుల నుంచి రక్షణ కల్పించేందుకు సిట్టింగ్ జడ్జి లేదా జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. బిజెపి అనుసరిస్తున్న మతోన్మాద, ఫాసిస్టు విధానాల వల్ల దేశంలో, రాష్ట్రంలో మహిళలపై దాడులు హింస రోజురోజుకూ పెరిగిపోతోందని, దీనికి వ్యతిరేకంగా విశాల పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతినిత్యం దేశంలో ఎక్కడో ఒకచోట మహిళలు హింసకు గురవుతున్నారని, దీనికి ప్రధాన కారణమైన మత్తు పదార్థాలు, మద్యాన్ని సంపూర్ణంగా నిరోధించాలని డిమాండ్ చేస్తున్నారు. మద్యాన్ని నిషేధించి మహిళల కళ్లలో ఆనందాన్ని నింపుతామని అధికారంలోకి రాకముందు ముఖ్యమంత్రి జగన్ ప్రకటించారన్నారు. కానీ నేడు మద్యాన్ని అధిక ప్రాధాన్యతనిస్తూ, మహిళలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలని వేధింపులు నిరోధించేందుకు అంతరంగిక ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈనేపథ్యంలో మహిళలపై హింసను నిరోధించాలన్న డిమాండ్‌తో ఐద్వా చేపట్టిన మహిళా పోరుయాత్ర బహిరంగ సభ ఈనెల 8న విజయవాడలో జరగనుందని, దాన్ని జయప్రదం చేయాలని పిలుపునిస్తున్నారు.

మహిళలపై పెరిగిన హింస



కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై హింస, దాడులు పెరిగాయి. మణిపూర్ ఘటనపై ప్రధాని తీరు దారుణం. ఇలాంటి పరిస్థితుల్లో మహిళ రక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి. ఇలాంటి దుర్ఘటనలను నిర్మూలించి మహిళలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలి.

హైమావతి, జిల్లా ప్రధాన కార్యదర్శి
గిరిజన మహిళా సంఘం

మహిళా చట్టాల అమలులో నిర్లక్ష్యం



దిశ, నిర్భయ వంటి మహిళా రక్షణ చట్టాల పటిష్ట అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమే నేడు దేశంలో, రాష్ట్రంలో మహిళల మీద జరుగుతున్న అకృత్యాలు, దాడులకు కారణం. సంపూర్ణ మద్యపాన నిషేధం అమలుకు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్, అధికారంలోకి వచ్చాక మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చి అవస్థల పాల్జేశారు.

కౌసల్య, జిల్లా అధ్యక్షురాలు
గిరిజన మహిళా సంఘం


దాడులు అరికట్టడంలో విఫలం



మహిళలపై హింసను అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. దేశంలో, రాష్ట్రంలో మహిళలపై దాడులు నిత్యకృత్యంగా మారాయి. వీటిని అరికట్టే దిశా నేరాలను అధ్యయనం చేయడానికి నిపుణులతో కమిటీ వేయాలి. మత్తు పదార్థాలే ఇన్ని అనర్థాలకు కారణం. మద్యం, మత్తు పదార్థాలను పూర్తిగా నిషేధించాలి.

జయ, జిల్లా గౌరవ అధ్యక్షురాలు
గిరిజన మహిళా సంఘం

సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాలి



మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాలి. అకృత్యాలపై పోరాడాలి. మహిళలపై నేరాలకు పాల్పడే నిందితులకు ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా విచారించి, కఠిన శిక్షలు విధించాలి. హింస, అశ్లీల, అసమానతలను ప్రేరేపించే సినిమా, టీవీ సీరియల్, ఇంటర్నెట్ కార్యక్రమాలను నిషేధించాలి

ఈశ్వరి, జిల్లా కమిటీ సభ్యులు
గిరిజన మహిళా సంఘం

డ్రమ్ము సీడర్ పద్ధతిలో వరినాట్లుపై అవగాహన

ప్రజాశక్తి- హుకుంపేట: డ్రమ్ము సీడర్ పద్ధతిలో వరి నాట్లు వేయడంపై డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు చిట్టిబాబు, జగన్నాథం, వ్యవసాయాధికారి లీలావతి, రైతులకుఅవగాహన కల్పించారచు. శనివారం మండలంలోని హుకుంపేట పంచాయతీ డి చింతలవీధి గ్రామంలో డ్రమ్ము సీడర్‌తో వరుసల్లో నాట్లు వేయడంపై అవగాహన కల్పించారు. ఈ విధానంలో సాగుతో ప్రయోజనాలను రైతులకు వివరించారు.


డ్రమ్ము సీడర్ పద్ధతిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు


ఊర్వశిమహాలక్ష్మికి నియామకపత్రాన్ని అందిస్తున్న గూడూరు వెంకటేశ్వరరావు

'బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి'

ప్రజాశక్తి-సీతమ్మధార : చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిసి సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. నగరంలోని పౌర గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులుగా నియమితులైన కోరుపెల్లి ఊర్వశి మహాలక్ష్మికి నియామక పత్రాన్ని వెంకటేశ్వరరావు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్ కల్పించినప్పుడే వారు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతారన్నారు. బిసిల కుల గణన చేపట్టడానికి ఎనిమిది రాష్ట్రాల అసెంబ్లీలో తీర్మానం చేశారని, 16 రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయని, అయినా కేంద్ర ప్రభుత్వం స్పందించ పోవడం విచారకరం అని పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పెబ్బిలి రవికుమార్, మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం బిసిలకు మేలు చేయాలనుకుంటే క్రిమిలేయర్ విధానాన్ని పూర్తిగా తొలగించాలని, బిసిలకు అట్రాసిటీ యాక్ట్ వర్తింపజేసేలా కొత్త చట్టం తీసుకురావాలని కోరారు. బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షులు కె.సత్యలక్ష్మి మాట్లాడుతూ, రాష్ట్రంలో మహిళలందరినీ ఏకతాటిపైకి తెచ్చి వారి సమస్యలపై పోరాడుతానన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన కె.ఊర్వశీమహాలక్ష్మి మాట్లాడుతూ, కేంద్రంలో బిసిలకు మంత్రిత్వ శాఖను ఏర్పాటుచేయాలని, బిసిలకు నిరుద్యోగ భృతి అందించాలని డిమాండ్‌చేశారు. రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేసినప్పుడే దేశంలో 50 శాతానికి పైబడి ఉన్న బిసిలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాకర్ల రాజారావు, సిహెచ్.నాగేశ్వరావు, జనరల్ సెక్రెటరీ ఆర్ కృష్ణవేణి, జోనల్ మహిళా కన్వీనర్ వెంకటలక్ష్మి, జోనల్ అధ్యక్షుడు అప్పలరాజు, జాతీయ కార్యవర్గ సభ్యులు బి.పద్మ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ఎదగాలి

ప్రజాశక్తి-ములగాడ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని, వాటి సాధనకై నిరంతరం చిత్తశుద్ధితో కృషి చేయాలని మల్కాపురం పోలీస్ స్టేషన్ సిఐ జిడి.బాబు సూచించారు. స్థానిక సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థినుల వీడ్కోలు సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువు వల్లే వ్యక్తిత్వం వికసిస్తుందని, ధైర్యం వస్తుందని చెప్పారు. మహిళా సాధికారతలో విద్య మొదటిదని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి మాట్లాడుతూ, సెయింట్ ఆన్స్‌లో చదివిన ప్రతి విద్యార్థినీ ఈ సమాజానికి ఉపయోగపడాలన్నారు. సమావేశంలో యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. వివిధ అంశాలలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు సిఐ ద్వారా బహుమతులను అందజేశారు. ఎన్‌సిసి, ఎన్ఎస్-ఎస్, క్రీడలు, ఇతర సాంస్కృతిక అంశాలలో ప్రతిభ కనబరిచిన వారిని ప్రశంసా పత్రాలతో సత్కరించారు.

గీతం దూర విద్య కోర్సుల్లో అడ్మిషన్లు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల సెంటర్ ఫర్ డిస్టెన్స్ లెర్నింగ్ (సిడిఎల్) ఆధ్వర్యాన దూర విద్యా విధానంలో ఎమ్ఎ ఇంగ్లీష్, బిఎ, బికామ్ డిగ్రీ కోర్సులలో 2023 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు సిడిఎల్ డైరక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. ఇంటి నుంచి దూర విద్యా విధానంలో ఈ కోర్సులను అభ్యసించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. పూర్తి సమాచారం, ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం (cdlgitam.edu) గీతం సిడిఎల్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 31వ తేదీలోగా అందజేయాలని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి -పద్మనాభం : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన శనివారం ఎంఇఒ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు నమ్మి పద్మరాజు మాట్లాడుతూ, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని, క్యాడర్ స్ట్రెంత్ అప్‌డేట్ చేయాలని డిమాండ్‌చేశారు.


మొక్కలు పంపిణీ చేస్తున్న సౌజన్య

రైతులకు మొక్కల పంపిణీ

ప్రజాశక్తి-చింతూరు : సొసైటీ ఫర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో రైతులకు పండ్ల మొక్కలను చింతూరు డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ జెపి సౌజన్య చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ బంగారు భవిష్యత్తు మేనేజర్స్ హేమంత్, సాగర్, సొసైటీ పర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణ కిషోర్, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్స్ సతీష్, గణేష్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఆత్రం సతీష్ కుమార్, లక్ష్మీపురం పంచాయతీ సెక్రటరీ అడబాల కిరణ్. కమ్యూనిటీ ఆర్గనైజర్ బుద్దుల నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో జగనన్న అణిముత్యాలు కార్యక్రమాన్ని పాఠశాల సిబ్బంది శనివారం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.సత్యవేణి. అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ సార్ల లలిత కుమారి, సర్పంచ్ కొండ జాకబ్, వైస్ సర్పంచ్ బొడ్డేటి వీరబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గొర్లె అనిల్ ప్రసాద్ (బాబీ), మాజీ కో- అప్షన్ సభ్యుడు బలిసుమిల్లి చంటి హాజరయ్యారు. 2022-23 సంవత్సరం పదవ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణులలో ప్రతిభ కనబరిచిన పి.శివకృష్ణ తిరుపతి రెడ్డి, కత్తుల సాయి కిరణ్ రెడ్డి, తుంబుడు జగన్మోహన్ రెడ్డి ముగ్గురు విద్యార్థులకు రూ.6వేలు చొప్పున నగదు, మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్స్ అందజేశారు.

ఆదివాసీ దినోత్సవం నిర్వహణకు సన్నాహాలు

ప్రజాశక్తి - సీలేరు : ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామని ఆదివాసీ నాయకులు గొర్ల గణేశ్వరరావు వెల్లడించారు ఆయన స్థానిక విలేకరులతో శనివారం మాట్లాడుతూ గత 6 సంవత్సరాలుగా దారకొండలో ఆదివాసీ దినోత్సవం జరుపుకున్నామని తెలిపారు. సీలేరు, దారకొండ, దుప్పిలివాడ గ్రామాల్లో భారీ జన సమీకరణ చేసి ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కోడా ఆనంద్, మార్క్ రాజు, బాబులు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రయంఫ్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ట్రయంఫ్ వైజాగ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ శుక్రవారం సాయంత్రం ప్రో బైకింగ్ ప్రెసిడెంట్ సుమీత్ నారంగ్ చేతులమీదుగా ఇసుకతోట సమీపంలోని మద్దిలపాలెం వద్ద ప్రారంభమైంది. న్యూ ట్రయంఫ్ స్పీడ్ 400 బైక్‌ను ఈ సందర్భంగా నగర మార్కెట్‌లోకి విడుదల చేశారు.

9 నుంచి సిజిఆర్ఎఫ్ సదస్సులు

ప్రజాశక్తి - విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్) పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్లలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 9 నుంచి సదస్సులు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సిజిఆర్ఎఫ్) ఛైర్మన్, విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ తెలిపారు. శ్రీకాకుళం సర్కిల్ సదస్సు శ్రీకాకుళం రూరల్ సబ్ డివిజన్‌లో ఈ నెల 9న, విశాఖపట్నం సర్కిల్ సదస్సు యలమంచిలి సబ్ డివిజన్‌లో 11న, విజయనగరం సర్కిల్ సదస్సు పార్వతీపురం సబ్ డివిజన్‌లో 18న, రాజమండ్రి సర్కిల్ సదస్సు జగ్గంపేట డివిజన్ ప్రత్తిపాడు సబ్ డివిజన్‌లో 22న, ఏలూరు సర్కిల్ సదస్సు జంగారెడ్డిగూడెం డివిజన్‌లోని కామవరపుకోట సబ్ డివిజన్ కార్యాలయంలో 23న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతాయన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీ, పేరుమార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్ ఫార్మర్ల మార్పిడి, తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై వినియోగదారులు ఈ సదస్సుల్లో సిజిఆర్ఎఫ్ కమిటీకి తెలియజేయాలన్నారు. విశాఖపట్నం సీతమ్మధారలోని ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలోని సిజిఆర్ఎఫ్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగానూ ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వినియోగదారుల సమస్యలను పరిశీలించి, విచారణ జరిపి న్యాయం చేస్తామని పేర్కొన్నారు. ఈ సదస్సుల్లో ఛైర్మన్ బి.సత్యనారాయణతో పాటు సిజిఆర్ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్.హరిబాబు, డాక్టర్ రాయసం సురేంద్ర కుమార్ హాజరవుతారని తెలిపారు.

ఘనంగా ఐఐపిఇ స్నాతకోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపిఇ) విశాఖపట్నం మూడో వార్షిక స్నాతకోత్సవం శనివారం నోవాటెల్ హోటల్‌లో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ జియోమాగ్నెటిజం, ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ గౌరవ శాస్త్రవేత్త ప్రొఫెసర్ అర్చనా భట్టాచార్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌరుల జీవితాల మెరుగుదలకు కృషి చేయాలని విద్యార్థులను కోరారు. ఎంచుకున్న అధ్యయన రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) వినూత్న ఉపయోగాలను అన్వేషించాలన్నారు. ఆయిల్ అండ్ ఎనర్జీ రంగాన్ని విద్యార్థినులు ఎంచుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

కదిలించిన పోరాటాలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

'పాడేరు ఘాట్‌రోడ్ దిగిన తరువాత నుంచి మాడుగుల మీదుగా విశాఖపట్నం వచ్చే రోడ్డులో కారు ప్రయాణమంటే భయమేస్తోంది. రోడ్డు గురించి ఎవరైనా అడుగుతారేమోనని నేమ్ బోర్డు తీసి కారులో పెట్టుకొని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది' - అని గత నెల 27న జరిగిన జిల్లా పరిషత్ స్థాయీ సంఘం సమావేశంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జె.సుభద్ర ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో జరిగిన మాడుగుల నియోజకవర్గ సమీక్ష సమావేశంలో ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు తన మాడుగుల నియోజకవర్గంలో రహదారుల పరిస్థితి వివరించి, రోడ్లు బాగోలేక జనం బూతులు తిడుతున్నారని, నియోజకవర్గంలో తిరగలేకపోతున్నామని మనస్తాపం చెందారు. యలమంచిలి నియోజకవర్గంలోని అచ్యుతాపురం, అనకాపల్లి రహదారి విస్తరణ పనులు జరగని విషయాన్ని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు నియోజకవర్గ సమీక్షలో ఉపముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాజన్నదొర ముందు ప్రస్తావిస్తూ తన గోడు వెల్లబోసుకున్నారు. వారెంత గగ్గోలు పెట్టినా ఫలానా ఇన్ని రోజులకు ఈ పని చేస్తామని సంబంధిత అధికారులేమీ హామీ ఇవ్వలేదు. ప్రజా ప్రతినిధులు హామీని పొందలేకపోయారు.

అదే సమయంలో నాన్‌షెడ్యూల్ గిరిజన సంఘం నేతృత్వంలో కోటవురట్ల మండలం గొట్టివాడ పంచాయతీ అణుకు గిరిజన గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలని, రోడ్డు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని గిరిజనులు జులై ఏడు నుంచి చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు కొన్ని విజయాలు సాధించగలిగాయి. ఏ ప్రభుత్వాలూ, ప్రజా ప్రతినిధులూ సాధించలేని, చేయలేని పనులను పోరాటాలతో గిరిజనులు సాధించుకున్నారు. పాఠశాలలేని ఆ గ్రామానికి నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌టిసి) కింద పాఠశాల మంజూరైంది. అంత్యోదయ కార్డులు మంజూరుపై హామీని పొందారు. ఇంకా రహదారి, మౌలిక సదుపాయాలు కల్పన పనులు జరగాల్సివుంది. ప్రజల పోరాటానికున్న శక్తి ఎలాంటిదో అణుకు ఆదివాసీలు రుజువుచేశారు. అడ్డురోడ్డు నుంచి నర్సీపట్నం రోడ్డు అత్యంత ఘోరంగా వుంది. ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజల



బాధలను గుర్తించిన సిపిఎం మరమ్మతులు పనులు చేపట్టాలని అడ్డురోడ్‌లో రాస్తోరోకో చేపట్టింది. వెంటనే ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. వారం రోజుల్లో మరమ్మతులు చేపడతామని ఆర్ అండ్ బి శాఖాధికారులు హామీ ఇచ్చారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా పనులు చేయించుకోలేక చతికిలపడ్డ పాలక ప్రభుత్వంలో ప్రజా పోరాటాలతో ప్రజల సమస్యలను సిపిఎం, ప్రజా సంఘాలు పరిష్కరించుకోగలుగుతున్నాయి.

అలాగే ఉపాధ్యాయులు, పంచాయతీ కార్మికులు ఇటీవల పోరాట మార్గంపట్టారు. జూన్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులకు జూన్, జులై జీతాలు చెల్లించని విషయం ప్రభుత్వం దృష్టికి రెండు నెలలుగా తీసుకొస్తున్నారు. రెండు నెలల జీతాలు చెల్లించాలని యుటిఎఫ్ నేతృత్వంలో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ధర్నా కూడా చేపట్టారు. పదిహేనవ ఆర్థిక సంఘం నిధులొస్తే పంచాయతీ కార్మికులు, ఎలక్ట్రీషియన్, గ్రీన్ అంబాసిడర్‌ల జీతాలు చెల్లించాలని సర్పంచ్‌లు భావించారు. ఆ నిధులను వారికి తెలియకుండానే కరెంట్ బిల్లులకు ప్రభుత్వం మళ్లించడంతో నిధుల కొరత తీరలేదు. కార్మికుల జీతాల బకాయిలు చెల్లించలేదు. జీతాల బకాయిలు చెల్లించాలని సిఐటియు నాయకత్వాన పంచాయతీ కార్మికులు ఇటీవల ధర్నా చేపట్టి హామీ పొందారు.


తనిఖీలు చేపడుతున్న ప్రత్యేక పోలీసు బలగాలు

ఎఒబిలో విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - సీలేరు : ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో పోలీసులు శనివారం మావోయిస్టు కదిలికలపై నిఘా పెట్టి విసకృతంగా తనిఖీలు నిర్వహించారు. మావోయిస్టులు అదును చూసి ఎటువంటి కార్యకలాపాలకైనా పాల్పడవచ్చని ఇంటలిజెన్సీ వర్గాలు హెచ్చరికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. గ్రాహౌండ్స్ స్పెషల్ పార్టీ పోలీస్ బలగాలతో ఏఓబిని జల్లెడ పడుతున్నారు. వారోత్సవాల్లో మావోయిస్టులు తమ ఉనికిని చాటుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఏ క్షణంలోనైనా వారి ఉనికిని చాటుకునేందుకు పోలీసు బలగాలను లక్ష్యంగా చేసుకొని మందు పాతరులు, గ్రానైట్స్ దాడి చేయవచ్చని పోలీసులు భావించి అప్రమత్తమయ్యారు. ఇందులో భాగంగానే స్థానిక ఎస్సై రామకృష్ణ సీలేరు పరిసర ప్రాంతాల్లో నిరంతరం సిఆర్పిఎఫ్ బలగాలతో మొహరించి గాలింపు చర్యలు చేపడుతున్నారు. స్థానిక ఏపీ జెన్కో చెక్‌పోస్టు, రామాలయం జంక్షన్, ఐటిఐ జంక్షన్ వద్ద పోలీస్ పహారీ నిర్వహిస్తూ తనిఖీలు చేశారు.

టిడిపి నాయకులపై దాడులు అమానుషం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : పుంగనూరులో టిడిపి నాయకులపై దాడులు అమానుషమని టిడిపి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు అన్నారు. దాడులను ఖండిస్తూ పెద్దిరాజు ఆధ్వర్యంలో రాజవొమ్మంగిలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందులలో చంద్రబాబు పర్యటనకు ప్రజలు బ్రహ్మరథం పట్టిన నేపథ్యంలో ఆ మీటింగ్‌కు తరలివచ్చిన అశేష జనావాహినిని వైసీపీ నేతలు చూసి ఓర్వలేక దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. చంద్రబాబు నాయకత్వంలో టిడిపి నేతలు ఎంత సమన్వయం పాటించిన వైసీపీ నేతలు కావాలనే రెచ్చగొడుతున్నారని, దాడులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. పోలీసులు వైసీపీ నేతలకు కొమ్ముకాస్తున్నారని, ఇది చాలా అన్యాయమన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జెట్టి మధు, అప్పలనాయుడు, ఎం శ్రీను, టి శ్రీను, గుప్తా పాల్గొన్నారు.

బిల్డర్లు అక్రమాలకు పాల్పడితే భారీగా జరిమానాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నగరంలో బిల్డర్స్ చేస్తున్న అక్రమాలపై ఇటీవల ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని కన్స్యూమర్స్ కౌన్సిల్ జిల్లా కమిషన్-1 తనూజ రెడ్డి అన్నారు. విశాఖ కన్స్యూమర్ కౌన్సిల్ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు శనివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిల్డర్లు ఫ్లాట్స్ అమ్మేటప్పుడు చెబుతున్న సౌకర్యాలను కల్పించడంలోనూ, సకాలంలో నిర్మాణాలు చేయకపోవడంతోనూ ఫ్లాట్స్ నిర్మాణంలో పలు డివియేషన్స్ ఉంటున్నాయన్నారు. లక్షలు, కోట్లు వెచ్చించి చేస్తున్న నిర్మాణాలలో కొనుగోలుదారులు నష్టపోకూడదన్నారు. అందుకే ఇటువంటి ఫిర్యాదుల విషయంలో అక్రమాలకు పాల్పడే బిల్డర్స్‌కు భారీగా జరిమానాలు విధిస్తున్నామని చెప్పారు.

సిఎంఆర్ సెంట్రల్‌లో హీరో జెడి చక్రవర్తి సందడి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : డిస్నీ హాట్ స్టార్‌లో శుక్రవారం విడుదలై ప్రేక్షక ఆదరణ పొందుతున్న వెబ్ సిరీస్ ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం విశాఖపట్నంలోని సిఎంఆర్ సెంట్రల్‌లో హీరో జెడి చక్రవర్తి సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కెరీర్‌లో ఇది మొట్టమొదటి వెబ్ సిరీస్ అని, తెలుగుతోపాటు హిందీ, కన్నడ, తమిళ్ భాషల్లో కూడా ప్రదర్శిస్తున్నామని, ఎనిమిది భాగాలు కలిగిన ఈ వెబ్ సిరీస్ అనుకోని మలుపులతో సస్పెన్స్ థ్రిల్లర్‌గా ముందుకెళ్తుందని తెలిపారు.